ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 20.12.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ. రాధాకృష్ణన్ ఈ రోజు హైదరాబాద్ లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.
2. జీహెచ్ఎంసీ విలీన ప్రక్రియపై సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.
3. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ నిరసనలు చేపట్టింది.
4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాదారణ కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ విభాగం సూచించింది.

-------------------------

**PREZ - VICE PRESIDENT**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ. రాధాకృష్ణన్ ఈ రోజు హైదరాబాద్ లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సాయంత్రం గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ లో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సాయంత్రం రామోజీఫిల్మ్‌సిటీలో జరిగే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్ పర్సన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఉప

రాష్ట్రపతి సీపీ. రాధాకృష్ణన్ పాల్గొంటారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సమీపంలో ఉన్న కన్హా శాంతివనాన్ని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ సందర్శిస్తారు.

**డెస్క్**

------------------------

**ECI**

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రెండో రోజు హైదరాబాద్ లో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం శ్రీశైలంలో కుటుంబంతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్న అనంతరం ఆయన నల్లమలలో పర్యటించారు. ఈ సందర్భంగా జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ... నల్లమల్ల అటవీ ప్రాంతాల సహజ అందం, జీవ వైవిధ్యం తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఈ పర్యటన తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొంటూ, సమన్వయంతో పని చేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు అటవీ శాఖ అధికారులను ఆయన అభినందించారు. కాగా ఈ రోజు జ్ఞానేష్ కుమార్ గోల్కొండ, హుస్సేన్‌సాగర్, చార్మినార్‌ను సందర్శించనున్నారు.

**పీటీసీ, నాగర్ కర్నూల్**

-------------------------

**Christmas**

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ సాయంత్రం నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఆయనతో పాటు పలవురు మంత్రులు, క్రైస్తవ, మైనారిటీ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎల్బీ స్టేడియం, నాంపల్లి, అబిడ్స్ పరిసర ప్రాంతాల్లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

**డెస్క్**

---------------------------

**GHMC**

జీహెచ్‌ఎంసీ విలీన ప్రక్రియపై సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. 24 గంటల్లో 300 వార్డుల మ్యాప్, జనాభా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సింగిల్ బెంచ్ ఆదేశించడంతో ఆ తీర్పును డివిజన్ బెంచ్ లో రాష్ట్ర

ప్రభుత్వం సవాలు చేసింది. దీంతో పిటిషన్ వేసిన 104, 134 వార్డుల వివరాలను మాత్రమే రేపు ఉదయం 10 గంటల్లోపు ప్రజలుకు అందుబాటులో ఉంచాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది.

డెస్క్

---------------------------

**టీపీసీసీ**

ఇటీవల జరిగన పంచాయతీ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తో కలిసి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. తిరుగుబాటు చేసిన నాయకులను సమన్వయం చేయలేకపోయిన ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్ లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

డెస్క్

------------------------

**BRS-KCR**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు నేతృత్వంలో రేపు శాసనసభాపక్షం, రాష్ట్రకార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ తెలియజేసింది. హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో జరిగే ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు, శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై పోరాటం చేయడానికి, చంద్రశేఖర్ రావు ఈ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

డెస్క్

------------------------

**తుమ్మల**

భద్రాచలంలో ఈనెల 30వ తేదీన నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను శాస్త్రోక్తంగా, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి

దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి దామోదర్ కు ఈ రోజు ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంత్రి పలు సూచనలు చేశారు.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

---------------------

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:**

భద్రాచలంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. స్వామివారిని మత్స్యవతారంలో అలంకరించారు. ఈరోజు నుంచి డిసెంబర్ 28 వరకు రోజుకొక అవతారం చొప్పున తొమ్మిది అవతారాల్లో  స్వామి వారు దర్శనం ఇవ్వనున్నారు. మరోవైపు ఈనెల 29న జరిగే స్వామి వారి తెప్పోత్సవం, 30న ఉత్తరద్వార దర్శనానికి దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో దామోదర్ రావు తెలిపారు.

**PTC-B. KGM**

--------------------

**పీసీసీ నిరసన**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ తెలంగాణ పీసీసీ నిరసనలు చేపట్టింది. సికింద్రాబాద్ లోని ఎంజీ రోడ్డులో పీసీసీ అధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఎమ్మెల్యే పెడమా బొజ్జు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజివికా మిషన్ గ్రామీణ్ గా మార్చిన విషయం తెలిసిందే….

**డెస్క్**

-----------------------

**పెద్ద పులి సంచారం…!**

నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవిలో పెద్దపులి దారి తప్పి కొల్లాపూర్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా పెద్దపులి సంచరిస్తుందని వదంతులు రాగా... సోమశిల, యంగంపల్లి, అమరగిరిలో పెద్దపులి జాడలు కనిపించాయని కొల్లాపూర్ రేంజ్ అధికారి హుస్సేన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులిని గుర్తించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**పీటీసీ – నాగర్ కర్నూల్**

--------------------------

**రోడ్డు ప్రమాదాలు**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రోడ్డు భద్రత కమిటీ సమావేశం ఈ రోజు నిర్వహించారు. జిల్లాలో సంవత్సరం నుండి తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి, బ్లాక్ స్పాట్స్ ని గుర్తించి ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు వంటి అనేక అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

**పీటీసీ వరంగల్**

----------------------

**చలి కాలం**

రాష్ట్రంలో ఈ రోజు, రేపు చలి తీవ్రత మరింత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాదారణ కంటే 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని చెప్పింది. ఉత్తర తెలంగాణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో 5 నుంచి 8 డిగ్రీల సెల్సియస్, హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో 6 నుంచి 8 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**పీఎస్**

-----------------------------

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని కోర్టుల్లో రేపు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ తెలిపారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని ఆయన చెప్పారు. పెండింగ్ కేసుల పరిష్కారంతో పాటు.. కేసులు రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**PTC-B. KGM**

--------------------------

**బుక్ ఫెయిర్**

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో 38వ జాతీయ పుస్తక ప్రదర్శన నిన్న రాత్రి ప్రారంభమైంది. పది రోజుల పాటు జరిగే ఈ బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఈసారి మొత్తం 367 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... పుస్తక పఠనం అలవాటు తగ్గిపోవడం వల్లే వ్యక్తుల్లో సద్గుణాలు కనుమరుగవుతున్నాయన్నారు. ప్రతి ఇల్లు ఒక గ్రంథాలయంగా రూపుదిద్దుకున్నప్పుడే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు సాంస్కృతిక శాఖ తరఫున 3 కోట్ల రూపాయిల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రాల్లోనూ నిర్వహించాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు.

**డెస్క్**

---------------------------

## Damodar Raja Narsimha

ఉద్యోగులకు, జర్నలిస్టులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ఎంప్లాయీస్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్.... వెల్‌నెస్ సెంటర్లలో సేవలను విస్తరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లలో గుండె, మూత్రపిండాల విభాగాలతో పాటు అన్ని విభాగాల్లో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను

అందుబాటులోకి తీసుకొచ్చే అంశంపై హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి నిన్న సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వివిధ స్పెషాలిటీలకు సంబంధించిన డాక్టర్లను, సిబ్బందిని వెల్‌నెస్ సెంటర్లలో నియమించి, పేషెంట్లకు పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లలో మందులు అందుబాటులో లేవంటూ ఉద్యోగులు, జర్నలిస్టుల నుంచి ఫిర్యాదులు వచ్చే పరిస్థితి ఉండకూడదని, ఆన్‌లైన్‌లో ఓపీ బుక్ చేసుకునేందుకు వీలుగా యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

**పీటీసీ, సంగారెడ్డి**

----------------------------

**లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుశిక్ష**

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే మూడేళ్లు జైలు శిక్షతోపాటు 50 వేల రూపాయల జరిమానా విధిస్తామని జోగులాంబ గద్వాల్ జిల్లా వైద్య అధికారి సంధ్యా కిరణ్మయి హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, మాట్లాడుతూ... జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

**పీటీసీ – జోగులాంబ గద్వాల**

------------------------------

**వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**నల్గొండ జిల్లా**

క్లెయిమ్ చేసుకోని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా క్లెయిమ్ చేసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం వెసులుబాటు కల్పించిందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ  జిల్లా స్థాయిలో క్లెయిములు పరిష్కరించేందుకు  నల్లగొండ కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన  ఒకరోజు శిబిరాన్ని లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.  ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్యాంకు శాఖ, భీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్ సంస్థ, శిభిరంలోని స్టాక్ బ్రోకరేజీ సంస్థ, ఆన్‌లైన్ ద్వారా స్టాక్ బ్రోకర్‌లలో దేనినైనా సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చనీ సూచించారు.

**పీటీసీ – నల్గొండ**

----------------------